క్లుప్తంగా

'గమ్యం' యాప్‌ను సద్వినియోగం చేసుకోండి



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న డిపో మేనేజర్ రామారావు

భద్రాచలంటౌన్: టీఎస్ ఆర్టీసీ నూతనంగా ప్రవేశపెట్టిన గమ్యం యాప్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ బి.రామారావు తెలిపారు. గమ్యం యాప్ సేవలు, వినియోగంపై ఆర్టీసీ బస్సుల్లోని ప్రయాణికులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ యాప్ ద్వారా ఇంటి వద్ద నుంచే బస్సులకు సంబంధించిన సమాచారాన్ని పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అల్లం నాగేశ్వరరావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు అందజేత

అశ్వాపురం: మండలంలో పరిధిలోని జగ్గారం గ్రామానికి చెందిన సుజాతకు రూ.18 వేలు, స్వరూపకు రూ.20 వేలు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ ఆధ్వర్యంలో ఆదివారం లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు. వైస్ ఎంపీపీ వీరభద్రం, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యుడు ఈదర సత్యనారాయణ, సర్పంచ్ సున్నం రాంబాబు, బీఆర్ఎస్ నాయకులు సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, చిలకా వెంకటరామయ్య, లంకెల రమేష్, కంసాని సత్యనారాయణ, జాన్ షాహిద్, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

గొడుగులు పంపిణీ

మణుగూరురూరల్: మండలంలోని కూనవరం రైల్వేగేట్ ప్రాంతంలో చిరువ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారికి రేగా విష్ణు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పంచాయతీ సర్పంచ్ ఏనిక ప్రసాద్ ఆదివారం పెద్ద గొడుగులను పంపిణీ చేశారు. అనంతరం బాంబేకాలనీ ముస్లిం మైనార్టీ సంఘం ఆధ్వర్యంలో రహదారికి ఇరువైపుల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు వల్లభనేని రమణ, సీహెచ్ అశోక్, మిట్టపల్లి కిరణ్, వహిద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై నిలిచిన వరద

భద్రాచలంటౌన్: పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి రాజుపేట కాలనీ వద్ద కేకే ఫంక్షన్ హాల్ ఎదురుగా చర్ల, భద్రాచలం ప్రధాన రహదారిపై భారీగా వరద నీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని ఎగువ కాలనీలలోని వర్షపు నీరు ఇక్కడికి చేరడంతో చెరువును తలపించింది. రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఇళ్లలోకి వరద నీరు చేరడంతో వారు బయటకు రాని పరిస్థితి ఏర్పడింది. గతంలో ఉండే డ్రైయినేజీ కాలువను కొందరు ఆక్రమించడంతోనే ఈ విధంగా వర్షపు నీరు చేరుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి డ్రెయియినేజీ ఆక్రమదారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విజయవంతం చేయండి

గుండాల: సెప్టెంబర్ 3న పద్మశాలి రాజకీయ శంఖారావాన్ని పురస్కరించుకుని హైదరాబాదులోని కొండా లక్ష్మణ్ ప్రాంగణం సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించ తలపెట్టిన 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు పోలు కనకయ్య అన్నారు. చలో హైదరాబాద్ కార్యక్రమం పోస్టర్ని ఆదివారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శంఖారావం సభలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్త రామకృష్ణ, దేవసాని సదయ్య, కొంతం నాగార్జున, చెన్న రాంబాబు, కందగట్ల సురేందర్, అనిల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని పలు కాలనీలకు చెందిన సుమారు 100 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరారు. యువకులకు పట్టణ అధ్యక్షుడు సరెళ్ల నరేష్, టీపీసీసీ సభ్యుడు నల్లపు దుర్గాప్రసాద్ కాంగ్రెస్ పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రవికుమార్, సతీష్, శ్రీనివాస రెడ్డి, మణికంఠ, సర్పంచ్ చలపతి, సుధీర్, ప్రదీప్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆలయ పునఃప్రారంభం

బూర్గంపాడు: ఇరవెండి గ్రామంలో ముత్యాలమ్మతల్లి ఆలయాన్ని ఆదివారం పునఃప్రారంభించారు. తాళ్లూరి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు తాళ్లూరి పంచాక్షరయ్య ఆలయాన్ని ప్రారంభించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి ఆయన రూ.2లక్షల విరాళం అందజేశారు. భక్తులకు అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు వల్లూరిపల్లి వంశీకృష్ణ, విజయరేణుక దంపతులు, సర్పంచ్ కొర్సా లక్ష్మి, ప్రకాశ్, నర్సింహారావు, వెంకటేశ్వర్లు, సతీష్ పాల్గొన్నారు.

పశువైద్యం.. అందని ధైన్యం

- ఏళ్లుగా సిబ్బంది కొరత
- ఇన్‌చార్జ్‌లతోనే నెట్టుకొస్తున్న వైనం
- మృత్యువాత పడుతున్న పశువులు
- రైతులకు తప్పని తిప్పలు



దుమ్ముగూడెంలోని పశు వైద్యశాల

దుమ్ముగూడెం: మండలంలో పశువైద్యశాఖలో సిబ్బంది కొరత వేధిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక పశువైద్య కేంద్రాల్లో సిబ్బంది కొరతతో పశువులకు సరైన వైద్యం అందడం లేదు. దీంతో సీజనల్ వ్యాధులతో పశువులకు, పెంపుడు జంతువులకు మృత్యువాత పడుతున్నాయి. మండల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మూడు పశువైద్య శాలలో పూర్తి స్థాయిలో సిబ్బంది లేకపోవడంతో ఈ పరిస్థితికి కారణంగా తెలుస్తుంది.

నాలుగు గ్రామాలకు ఒక్కడే వైద్యుడు

మండలంలో 37 గ్రామపంచాయతీలలో 108 గ్రామాలున్నాయి. ఈ గ్రామాలలో వేల సంఖ్యలో గేదెలు, ఆవులు, మేకలు, పందులు, పెంపుడు కుక్కలు ఉన్నాయి.వాటికి వైద్య సేవలు అందించడానికి ములకపాడు, నర్సాపురం, పర్ణశాలలో పశువైద్యశాలలు ఉన్నాయి. బూర్గంపాడు వైద్యశాలకు చెందిన డాక్టర్ రవీందర్‌ను ఇక్కడ ఇన్‌చార్జ్ వైద్యుడిగా నియమించారు. బూర్గంపాడు, చర్ల, పాల్వంచ, దుమ్ముగూడెం ఈ నాలుగు మండలాలకు ఒక్కడే వైద్యుడు ఉన్నాడు. మండలంలో ఉన్న 22,942 ఆవులు, 2,612 గేదెలు, 6,652 గొర్రెలు, 17,158 మేకలు, 329 పందులు, 531 కుక్కలకు ఆ ఒక్క వైద్యుడే ఆధారం. దీంతో పూర్తి స్థాయిలో పశువులకు వైద్య సేవలు అందించలేకపోతున్నారు.అత్యవసర సమయాల్లో వైద్యం అందక పశువులు మృత్యువాత పడుతుండటంతో పశుపోషకులు ఆవేదన చెందుతున్నారు.దుమ్ముగూడెం వైద్యశాలలో డాక్టర్, వెటర్నరీ అసిస్టెంట్, అటెండర్ ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఒక్క వెటర్నరీ అసిస్టెంట్ మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. అటెండర్‌ను నర్సాపురం వైద్యశాలకు డిప్యూటేషన్‌పై పంపించారు. నర్సాపురం వైద్యశాలలో వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్, అటెండర్ ఉండాల్సి ఉండగా అక్కడ వారు పదవి విరమణ పొందడంతో దుమ్ముగూడెం అటెండర్‌ను అక్కడ డిప్యూటేషన్‌పై ఉంచారు. అలాగే పర్ణశాల వైద్యశాలలో జేవీఓ, అటెండర్ ఉండాల్సి ఉండగా కేవలం జేవీఓ ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు.ఈ మూడు వైద్యశాలల్లో 7గురు సిబ్బంది విధులు నిర్వహించాల్సి ఉండగా ఇన్‌చార్జ్ డాక్టర్ పర్యవేక్షణలో కేవలం ముగ్గురు మాత్రమే పని చేస్తున్నారు. అలాగే ప్రభుత్వం పశుపెంపకందారులకు అనేక పథకాలు ప్రవేశపెడుతున్నామని చెబుతున్నా ఆచరణలో అమలు కావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై కొరవడిన నజర్..

వర్షాలతో గేదెలు, మేకలు, గొర్రెలకు వివిధ రకాల రోగాలు వ్యాప్తి చెందే పరిస్థితి నెలకొంది. వ్యాధుల బారిన పడుతున్నప్పటికీ సీజనల్ వ్యాధుల దృష్ట్యా ఏర్పాటు చేసే పశువైద్య శిబిరాలు ఎక్కడా కనిపించడం లేదు. రైతులు, పశుపోషకులు, కాపర్లను అప్రమత్తం చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలూ అందడం లేదు. దీంతో వైద్యం చేసే వారు అందుబాటులో లేక ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. దీంతో పెంపకం దారులపై ఆర్థిక భారం పడనుంది. అలా అని ప్రభుత్వ ఆస్పత్రుల మీదే ఆధారపడదామా అంటే మండలంలోని పశువైద్యశాలల్లో సరిపడా సిబ్బంది, సౌకర్యాలు లేవు. దీంతో పశువులు మృత్యువాత పడుతున్నాయి. ముఖ్యంగా వానాకాలంలో పశువులకు జబ్బవాపు, గుండెవాపు, గొంతువాపుతోపాటు ఇతర రకాల వ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెందుతాయి. ఆస్పత్రుల్లో మందులున్నా వ్యాధులకు సరైన మందులు ఇచ్చే వారు లేని కారణంగా పశువులు మృత్యువాత పడుతున్నాయని రైతులు, పెంపకం దారులు ఆందోళన చెందుతున్నారు.

ఆసక్తి చూపని పశువైద్యులు

మండలంలో ఖాళీలను భర్తీ చేయడానికి అధికారులు ప్రయత్నిస్తున్నప్పటికి విధులు నిర్వహించడానికి పశువైద్యులు ముందుకు రావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెద్ద మండలం, పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం కావడంతో పాటు గోదావరి ముంపు ప్రాంతం కావడం వల్ల పని భారం ఎక్కువగా ఉంటుందనే సాకుతో ఇక్కడ విధులు నిర్వహించడానికి ఆసక్తి కనబరచడం లేదు. ఉన్నతాధికారుల ఒత్తిడితో ఇక్కడ జాయిన్ అయినా కొన్ని రోజులు పాటు విధులు నిర్వహించి వెంటనే మైదాన ప్రాంతాలకు డిప్యూటేషన్‌పై వెళ్లిపోతున్నారనే విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి.

వైద్యశాల ఖాళీ..



అత్యవసర సమయంలో పశు వైద్యశాలకు వస్తే వైద్యశాలలో ఎవరూ ఉండటం లేదు. దీంతో వైద్యశాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్న సిబ్బంది ఫీల్డ్‌లోకి వచ్చి, వైద్యశాలలో పని చేయలేక ఇబ్బంది పడుతున్నారు.అధికారులు స్పందించి సిబ్బందిని ఏర్పాటు చేయాలి.

– యానబోయిన జయమ్మ, బైరాగులపాడు

ఇబ్బంది పడుతున్నాం



గ్రామాల్లో పశువులకు సరైన వైద్యసేవలు అందని కారణంగా ఇబ్బందులు పడుతున్నాం. ఆస్పత్రుల్లోకి పశువులను తీసుకువెళ్తే వైద్యం అందడం లేదు. దీంతో వైద్యం కోసం నాటుమందులను ఆశ్రయించాల్సి వస్తోంది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుని పశుసంపదను రక్షించాలి.

– అంజర్ బేగ్, లక్ష్మీనగరం

పొంచి ఉన్న ప్రమాదం



రోడ్డు వైపునకు ఒరిగిన చెట్టు

బూర్గంపాడు: మండల కేంద్రం బూర్గంపాడులోని గౌతమిపురం వద్ద మార్కెట్‌యార్డుకు ఎదురుగా రాష్ట్రీయ రహదారిపై పెద్దరావి చెట్టు వేర్లు తెగి ఓ పక్కకు ఒరిగింది. పెద్ద గాలివాన వస్తే చెట్టు రోడ్డుపై పడిపోయే ప్రమాదముంది. రోజు వందలాది వాహనాలు, పశువులు ఈ రహదారిపై తిరుగుతుంటాయి. ఈ చెట్టు గాలివానకు పడిపోకముందే ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆత్మ కమిటీ చైర్మన్‌కు సత్కారం

భద్రాచలంఅర్బన్: ఆత్మకమిటీ చైర్మన్‌గా నియమితులైన ఎల్.వెంకటేశ్వర్లును భద్రాచలం రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పి.మహాలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు, రాయితీలు పాడి రైతులకు అందేలా కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వం నుంచి కొత్త వంగడాలు, కొత్త పరికరాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో భద్రాచలం రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ శ్రీమహాలక్ష్మి, ట్రెజరర్ విద్యాసాగర్, ఇమ్మిడియట్ పాస్ట్ ప్రెసిడెంట్ వసంతరావు, ప్రెసిడెంట్ ఎలక్ట్ బాలాజీ రావు, పాస్ట్ ప్రెసిడెంట్స్ రాంబాబు, రఫీ, మునికేశవ్, నాగేశ్వరరావు, సభ్యులు రవికుమార్, సాని కొమ్మి శంకర్ రెడ్డి, చలపతి, రామకృష్ణ, భద్రం, పాష, హరి ప్రసన్నకుమార్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువులకు దుస్తులు పంపిణీ



దుస్తులు అందజేస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, ఎస్సై మధుప్రసాద్

భద్రాచలంఅర్బన్: మదర్ థెరిస్సా 113వ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం భద్రాచలం పట్టణంలోని మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో నవజాత శిశువులకు ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ, పట్టణ ఎస్సై మధు ప్రసాద్, గైనకాలజిస్ట్ నవ్యల చేతుల మీదుగా నవజాత శిశువుకు రెండు జతలు చొప్పున దుస్తులు అందజేశారు. మొత్తం 30 మంది చిన్నారులకు దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ.. ఎక్కడో యుగోస్లేవియాలో పుట్టి కలకత్తా మురికివాడలోని అభాగ్యుల జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి మదర్ థెరిస్సా అని కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు కొప్పుల మురళి, సభ్యులు కోమటిరెడ్డి చైతన్య, లోచన్, జయరాం, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల పూజలు



భద్రాచలంటౌన్: బోనాలతో మహిళలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం వద్ద ఉన్న చిలకలగండి ముత్యాలమ్మ తల్లి, గోగులపూడి అటవీ ప్రాంతంలోని గుబ్బల మంగమ్మ తల్లి ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసం కావడంతో ముత్యాలమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు చేరుకుని అమ్మవార్లను దర్శించుకున్నారు. వివిధ రకాల పూజలు చేశారు. అమ్మవార్లకు మొక్కుబడులు చెల్లించుకుని, అన్నసమారాధన కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. శ్రావణ మాసం నేపథ్యంలో ఆలయాల వద్ద భక్తుల రద్దీ నెలకొంది.

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని లంబాడీ కాలనీలో నాగ ముత్యాలమ్మ అమ్మవారి జాతర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాలనీ వాసులు బోనాలతో ఊరేగింపుగా మేళతాళాలతో అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.

ఆలయాన్ని సందర్శించిన జెడ్పీటీసీ

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని ముత్యాలమ్మ ఆలయాన్ని ములకలపల్లి జెడ్పీటీసీ సున్నం నాగమణి ఆదివారం సందర్శించారు. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. మండల కాంగ్రెస్ నాయకులు గుగులోతు బాబు, మాజీ సర్పంచ్ రుక్మిణి, దారం గోవిందరెడ్డి, బడుగు కృష్ణవేణి, బడుగు వెంకటేశ్వర్లు, చిన్ని పాల్గొన్నారు.

మహ్మద్‌నగర్‌లో కాంగ్రెస్ నేతల పర్యటన

చండ్రుగొండ: మండలంలోని మహ్మద్‌నగర్ గ్రామంలో విషజ్వరాలు ప్రబలిన నేపథ్యంలో కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ నాయకుడు జారే ఆదినారాయణ ఆదివారం పర్యటించారు. జ్వరపీడితులను పరామర్శించారు. అనంతరం కాంగ్రెస్‌పార్టీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు భోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, కేశబోయిన నర్సింహారావు, బొర్రా సురేష్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

వీరయ్యకు ఎమ్మెల్యే పరామర్శ

భద్రాచలంటౌన్: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న గొండ్వానా సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సొందె వీరయ్యను భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఆదివారం పరామర్శించారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సొందె వీరయ్య ఆరోగ్య పరిస్థితి గురించి ఎమ్మెల్యే వీరయ్య డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చులకు ఎల్‌ఓసీ ద్వారా ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తానని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.


పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

మణుగూరురూరల్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి, జెడ్పీటీసీ పోశం నరసింహారావు అన్నారు. హరితహారంలో భాగంగా ఆదివారం మణుగూరు తహసీల్దార్ కార్యాలయంలో వారు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతకు, కాలుష్య నివారణకు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు లీలావతి, శ్రీనివాస్, యూడీసీ నరసింహారావు, సర్వేయర్ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సమన్యాయం చేయాలి

అశ్వాపురం: మహిళలకు అన్ని రంగాల్లో సమన్యాయం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్ అన్నారు. మండల పరిధిలోని అమెర్ద గ్రామ పంచాయతీలో ఆదివారం జరిగిన పార్టీ మహిళా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డ్వాక్రా మహిళలకు రుణమాఫీ అమలు చేస్తున్నారని, తెలంగాణలో కూడా అమలు చేయాలన్నారు. భారతదేశంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలన్నారు. సమావేశంలో మహిళా మండలి అధ్యక్షురాలు తెల్లం వెంకటరమణ, ఇరుగు శ్రీకాంత్, ఇరుగు భద్రమ్మ, నరసమ్మ, లక్ష్మి, పార్వతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా పొలాల రహదారి



అధ్వానంగా ఉన్న వ్యవసాయ క్షేత్రాల దారి


చర్ల: మండలంలోని ఆర్ కొత్తగూడెంలో వ్యవసాయ పొలాలకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. ఆర్ కొత్తగూడెం, దానవాయిపేట, ఎస్సీకాలనీలకు చెందిన సుమారు 200 మంది రైతులకు చెందిన వ్యవసాయ పొలాలు ఆర్ కొత్తగూడెం నుంచి గోదావరి నదికి వెళ్లే మార్గంలో ఇరు వైపులా ఉన్నాయి. అయితే ఈ మార్గంలో ఏటా రైతులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ పాలకులు పట్టించుకోకపోవడాన్ని రైతులు తీవ్రంగా తప్పుపడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆర్ కొత్తగూడెం నుంచి గోదావరి నది వరకు ఉన్న సుమారు 3 కిలోమీటర్ల రహదారిపై పెద్ద ఎత్తున వరదనీరు చేరి బురదమయంగా మారింది. ఈ క్రమంలో తప్పని సరి పరిస్థితిల్లో ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు రాకపోకలు సాగిస్తుండడంతో అది మరింత బురదమయంగా మారి కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా మారడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు ఎరువులు, వరినారు, మిర్చి నారు వంటివి తీసుకెళ్లేందుకు నానా పాట్లు పడుతున్నారు. అయినప్పటికీ దీనిపై అధికారులెవరూ పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. స్థానిక పంచాయతీ పాలకవర్గం, అధికారులు కూడా దీనిపై దృష్టి సారించడం లేదని చెబుతున్నారు.

ఒత్తిళ్లను అధిగమించాలి

బూర్గంపాడు: క్రమశిక్షణ, నిబద్ధతతోపాటుగా ఒత్తిళ్లను అధిగమించి లక్ష్యాలను సాధించుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత అన్నారు. ఇటీవల విడుదలైన ఎస్సై కొలువుల ఫలితాల్లో ఉద్యోగం సాధించిన మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన మేడం తేజేశ్వర్‌రెడ్డిని అదేగ్రామానికి చెందిన నేస్తం చారిటబుల్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జెడ్పీటీసీ శ్రీలత మాట్లాడుతూ.. తేజేశ్వర్‌రెడ్డి చిన్నతనంలోనే రోడ్డు ప్రమాదంలో తండ్రి తిరుపాల్‌రెడ్డిని పోగొట్టుకున్నప్పటికీ తల్లి కళావతి ప్రోత్సాహంతో ఎస్సై కొలువును సాధించాడన్నారు. ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని యువత ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా తేజేశ్వర్ రెడ్డిని శాలువాలతో సత్కరించి, మెమొంటోలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజారావు, బూర్గంపాడు ఎస్సై రాజేశ్‌కుమార్, సర్పంచ్ భూక్యా దివ్యశ్రీ, ట్రస్ట్ అధ్యక్షుడు బత్తుల రామకొండారెడ్డి, గ్రామ పెద్దలు కైపు సుబ్బరామిరెడ్డి, దామోదర్‌రెడ్డి, కొండ్రు వెంకటేశ్వర్లు, బి.రామకొండారెడ్డి, కామిరెడ్డి నాగిరెడ్డి, చేతుల వీర్రాజు, గాదె నర్సిరెడ్డి, ఝున్సం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం



ఓటర్ నమోదుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ రాఘవరెడ్డి

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామపంచాయతీలో మణుగూరు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ వేమూరి రాఘవరెడ్డి సందర్శించి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్ నమోదు, ఓటు హక్కు ప్రాధాన్యతను గ్రామస్తులకు వివరించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటర్ నమోదు చేయించుకోవాలని, నైతికతతో కూడిన ఓటు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు లీలావతి, శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అహోబిల మఠానికి ఫ్రిడ్జ్ వితరణ



భూపతిరావు కుటుంబ సభ్యులను ఆశీర్వదిస్తున్న ఆలయ అర్చకులు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని అహోబిల మఠానికి పట్టణానికి చెందిన డాక్టర్ గోళ్ల భూపతిరావు కుమారుడు అరుణ్ కుమార్ ఆదివారం ఫ్రిడ్జ్‌ను వితరణగా అందించారు. అనంతరం ఆలయ అర్చకుడు భూపతిరావు కుటుంబ సభ్యుల పేరిట అర్చన నిర్వహించి, వారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు డాక్టర్ కృష్ణ చైతన్య, గోళ్ళ మంజుల, స్వప్న, జ్యోషిక, తరుణిలు పాల్గొన్నారు.

సభకు తరలిన బీజేపీ శ్రేణులు



మణుగూరురూరల్: సభకు తరలివెళ్తున్న బీజేపీ నాయకులు

మణుగూరురూరల్: కేంద్రం హోంశాఖ మంత్రి అమిత్‌షా ఖమ్మం బహిరంగ సభకు మణుగూరు మండలం నుంచి బీజేపీ నాయకులు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమాన్ని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జాడి దేవేందర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. సభలకు వెళ్లిన వారిలో బీజేపీ రాష్ట్ర నాయకులు జంపన సీతారామరాజు, పున్నం బిక్షపతి, భూక్యా ప్రసాద్, కుంజా రామకృష్ణ, మధుసూదన్, లింగం పల్లి రమేష్, మందపాటి మోహన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మంలో తలపెట్టిన రైతు గోస-బీజేపీ భరోసా సభకు మండలం నుంచి ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బీంరెడ్డి బాల వెంకటరెడ్డి, జబ్బూరు రమేష్, చిలుకూరి వెంకటరెడ్డి, జటంగి కృష్ణ, దేవి బాలకిరణ్, తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: కేంద్ర హోం మంత్రి అమిత్ హాజరైన ఖమ్మంలో జరిగిన రైతు గోస-బీజేపీ భరోసా బహిరంగ సభకు మండలంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు బస్సులలో తరలివెళ్లారు. వారిలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ముక్కు శ్రీనివాసరెడ్డి, మండల అధ్యక్షుడు తాటిపాముల అయిలయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు సురకంటి లింగారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సున్నం సారయ్య, మండల కార్యదర్శి కోలా భాస్కర్, సోమ కృష్ణకుమారి, నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

అటెన్షన్ ప్లీజ్

నిరంతరం వెలుగులే!



భద్రాచలం పట్టణంలో స్నాన ఘట్టాలతో పాటు కరకట్ట ప్రాంతాల్లో విద్యుత్‌శాఖ అధికారులు ఏర్పాటు చేసిన వీధి లైట్లు నిరంతరం వెలుగుతున్నాయి. రాత్రి మాత్రమే వెలిగి పగలు ఆర్పే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో రాత్రి, పగలు తేడా లేకుండా వెలుగుతున్నాయి. దీంతో భారీగా విద్యుత్ వృథా అవుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించిన మెయిన్ స్విచ్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

– భద్రాచలంటౌన్

ప్రశ్నించాల్సిన అధికారి: రాజారావు, విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్, భద్రాచలం
ఫోన్ నంబర్: 9440811553